# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 59, EDITOR:CHERUKU UPENDAR, DATE : FRIDAY 23 JUNE 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 59, ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శుక్రవారం 23 జూన్ 2023 పేజీలు : 4 వెల : 5/-


జో బైడెన్‌తో ప్రధాని మోదీ భేటీ

## రక్షణ రంగంలో కీలక ఒప్పందాలు



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

రక్షణ సహకారంపై చర్చించారు. భారత్–అమెరికా రక్షణ సహకారంలో భాగంగా స్ట్రైకర్ సాయుధ వాహనం హో విట్జర్‌లు, ఓఖ్–9 రీపర్ డ్రోన్లు, ఉఇ–ఈ414 ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ల తయారీకి సాంకేతికత సహకారం, ఓ777ని కూడా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు ఢిల్లీ, వాషింగ్టన్ అధికారులు తెలిపారు. ఢిల్లీ, వాషింగ్టన్

మిగతా 2లో...

ఇడుపుల పాయకు

## రాహుల్ , సోనియా ?



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి రోజున షర్మిల తన పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేయబోతున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఆ కార్యక్రమం కూడా అక్కడా ఇక్కడా కాకుండా ఏకంగా ఇడుపుల పాయలోనే జరుగుతుందని కాంగ్రెస్ వర్గాలు ప్రచారం చేస్తూండటం రాజకీయంగా సంచలనం సృష్టించేదే. నిజమో కాదో అధికారికంగా ప్రకటించేదాకా స్పష్టత లేదు కానీ.. నిజంగానే ఇలాంటి పరిణామం జరిగితే మాత్రం.. తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో కాంగ్రెస్ భారీ వ్యూహంతో రంగంలోకి దిగుతుందని అనుకోవచ్చంటున్నారు. జులై 8న వైఎస్ జయంతి సందర్భంగా రాహుల్ గాంధీ, సోనియా గాంధీలు కడపజిల్లాలోని ఇడుపులపాయకు

మిగతా 2లో...

కాంగ్రెస్ నాయకుల అరెస్టులు

## అప్రజాస్వామికం

### టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



కాంగ్రెస్ నాయకుల అరెస్టులు అప్రజాస్వామికమని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల పేరితో కేసీఆర్ పార్టీ ప్రచారం చేసుకుంటూ ప్రజాధనాన్ని దుర్వినియాగం చేస్తూన్న విషయం వాస్తవం కాదా. ఇది ఖచ్చితంగా దశాబ్ది దగా నే నని అన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక.ఒక హామీ అయిన పూర్తిగా అమలు చేసారా. కేసీఆర్ ఇచ్చి అమలు చేయకుండా మోసం చేసిన హామీలనే మేము ప్రశ్నిస్తున్నాం. ప్రతిపక్ష పార్టీగా ప్రజా సమస్యలపై పోరాడే హక్కు ఉంది. ముందస్తు అరెస్టులు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులను వెంటనే విడుదల చేయాలి. కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేసి ఉద్యమాన్ని ఆపలేరు. మేము అధికారంలోకి వచ్చాక ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తామని అన్నారు.

కాంగ్రెస్ లో చేరడమంటే

## బీఆర్ఎస్‌కు సహకరించినట్లే

- బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్ పైనే కేసీఆర్ నమ్మకం ఎక్కువ
- ప్రచారం కోసం వెయ్యి కోట్ల ప్రజా ధనాన్ని ఖర్చు చేస్తారా?

### బండి సంజయ్



కరీంనగర్- ప్రభాత సూర్యుడు

కాంగ్రెస్ లో చేరడమంటే బీఆర్ఎస్ కు సహకరించినట్లేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. ముఖ్య మంత్రి కేసీఆర్ కు బీఆర్ఎస్ నాయకల కంటే కాంగ్రెస్ పైనే ఎక్కువ నమ్మకం ఉందన్నారు. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీని నడిపిస్తోందే కేసీఆర్ అని, 30 స్థానాల్లో ఆ పార్టీకి డబ్బులు పంపిణీ చేశారని అన్నారు. కాంగ్రెస్ నుండి ఎవరు గెలిచినా మళ్లీ వెళ్లేది బీఆర్ఎస్

మిగతా 2లో...



## మళ్లీ గెలిపిస్తే..

# పటాన్‌చెరు-హయత్‌నగర్ మెట్రో

- తొలి సమావేశంలోనే ఆమోదం
- ప్రభాత సూర్యుడు వార్తకు స్పందన
- పటాన్‌చెరు బహిరంగ సభలో సీఎం కేసీఆర్
- కొల్లూరులో 15,600 డబుల్ బెడ్రూం ఇళ్లు ప్రారంభం
- పటాన్‌చెరులో రూ.184 కోట్లతో 200 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన






తెలంగాణ

బ్యూరో చీఫ్ - ప్రభాత సూర్యుడు


ముఖ్యమంత్రి కేసీఆర్ సంగారెడ్డి జిల్లాలో పర్యటన సందర్భంగా గురువారం 'ప్రభాత సూర్యుడు' దినపత్రిక ప్రచురించిన 'ఎన్నికల హామీలు..ఉత్తుత్తేనా..!' కథనానికి స్పందన లభించింది. 2014 , 2018 ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ పటాన్‌చెరు వరకు మెట్రో రైలు పొడిగింపు హామీ ఇచ్చినా ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు. నిన్న సంగారెడ్డి జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న ముఖ్యమంత్రి కేసీఆర్ పటాన్‌చెరు పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో కేసీఆర్ దీనిపై సానుకూలంగా స్పందించారు. పటాన్‌చెరు నుండి హయత్ నగర్ వరకు మెట్రో పొడిగింపుకు ఓకే అన్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే..

పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. కొల్లూరులో 128 ఎకరాల్లో నిర్మించిన 15,600 డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రారంభించిన ముఖ్యమంత్రి అనంతరం పటాన్‌చెరు పట్టణంలో సుమారు రూ.184 కోట్లతో 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో సీఎం కేసీఆర్ మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం పటాన్‌చెరు వాసులకు శుభవార్త తెలిపారు. భవిష్యత్తులో

మిగతా 2లో...

## హుస్సేన్ సాగర్ ఒడ్డున అమర దీపం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల ముగింపు సందర్భంగా ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు చేతుల మీదుగా "తెలంగాణ అమరుల స్మారకం ? అమర దీపం" ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నడిబొడ్డున యావత్ తెలంగాణ సమాజం గర్వించే మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతం కానున్నది. రాష్ట్ర సాధన కోసం తెలంగాణ బిడ్డలు చేసిన త్యాగాల స్ఫూర్తి నిత్యం ప్రజ్వరిల్లేలా, వారి ఆశయాలు ప్రజలకు నిత్యం స్ఫురణకు వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన 'అమరవీరుల దీపం' హుస్సేన్ సాగర్ తీరాన ప్రతి రోజూ దేదీప్యమానమై వెలుగనున్నది. తెలంగాణ రాష్ట్ర సచివాలయానికి ఎదురుగా ఆరు అంతస్తుల్లో ప్రభుత్వం అమరవీరుల జ్యోతిని రూపొందించింది. రాష్ట్ర ప్రభుత్వం హుస్సేన్

మిగతా 2లో...

## యువత చుట్టూ టీ రాజకీయాలు

వరంగల్- ప్రభాత సూర్యుడు



తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు యువత చుట్టూ తిరుగుతున్నాయి. యూత్ డిక్లరేషన్ పేరిట హామీల వర్షం కురిపిస్తున్నాయి. వచ్చే ఎన్నికల యువతను తమ వైపు తిప్పుకునేందుకు ప్రయతి ్నస్తున్నాయి. తెలంగాణ రాజకీయ సమీకరణాలు రోజురోజుకూ మారిపోతున్నాయి. యువతను తమవైపు తిప్పుకోవడానికి ప్రధాన పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. నోటిఫికేషన్ల విడుదలతో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని బీఆర్ఎస్ చెబుతోంది. కాంగ్రెస్ ఇప్పటికే యూత్ డిక్లరేషన్ ప్రకటించింది. ఈ హామీలతో యువత ఓట్ బ్యాంకు తమ

మిగతా 3లో...

సీట్ల అమ్మకమే లక్ష్యంగా

## ఐటీ రైడ్స్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలోని పది ప్రైవేటు మెడికల్ కాలేజీలు నలభై ఐదు సీట్లు బ్లాక్ చేసి ఒక్కో సీటును కోట్లకు అమ్ముకున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. మెడికల్ కాలేజీలపై ఇలాంటి ఆరోపణలు చాలా కాలంగా ఉన్నాయి. అయితే ఈడీ ఇప్పుడు సోదాలు ప్రారంభించడంతో మరోసారి చర్చనీయాంశం అవుతోంది. తెలంగాణలో మొత్తం పది మెడికల్ కాలేజీల్లో ఈడీ అధికారులు ఒకే సారి సోదాలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ తో పాటు 15 ప్రాంతాల్లో 11 బృందాలుగా విడిపోయి ఈడీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. కామినేని , ఎస్వీఎస్ , ప్రతిమ , మమతా మెడికల్ కాలేజీల్లోనూ సోదాలు చేస్తున్నారు. మొత్తం పది మెడికల్ కాలేజీల యాజమాన్యాల

మిగతా 3లో...

## ఇడుపుల పాయకు
# రాహుల్ , సోనియా ?

(మొదటిపేజీ తరువాయి)

రానున్నారని, అక్కడ వైఎస్ సమాధి వద్ద నివాళులు అర్పించనున్నారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఇదే జరిగితే వైఎస్ కుటుంబం మరలా కాంగ్రెస్ పార్టీకి దగ్గరవుతుందని అనుకోవచ్చు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయింది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కొంతమేర బలంగా ఉన్నప్పటికీ, ఏపీలో ఆ పార్టీ పూర్తిగా బలహీనపడింది. గత రెండు ఎన్నికల్లోనూ ఒక్కసీటును కూడా ఆ పార్టీ గెలుచుకోలేకపోయింది. మరి వైఎస్ కుటుంబం ఆ పార్టీతో కలిస్తే కాంగ్రెస్‌కు మళ్లీ పునర్వైభవం సాధ్యమౌతుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల.. సొంతంగా పార్టీ నడపడం కన్నా జాతీయ పార్టీలో విలీనం చేయడం మంచిదని అనుకుంటున్నారు. కర్ణాటకకు చెందిన డీకే శివకుమార్ మధ్యవర్తిత్వంతో ఇప్పటికే చర్చలు పూర్తయ్యాయని చెబుతున్నారు. వైఎస్ఆర్ టీపీ అధ్యక్షురాలు షర్మిలకు రాహుల్ గాంధీ సన్నిహితుడు కేసీ వేణుగోపాల్ ఫోన్ చేసి మాట్లాడారని.. విలీనంపై ప్రాథమిక చర్చలు పూర్తయ్యాయని అంటున్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్న రోజుల్లో నాటి ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియా గాంధీతో సత్సంబంధాలు ఉండేది. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు వైఎస్ఆర్ కీలక పాత్రను పోసించారు. పైగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి చివరి కోరిక.. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడం. ఈ కారణం చెప్పి షర్మిల పార్టీని విలీనం చేయవచ్చని భావిస్తున్నారు. వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ కాంగ్రెస్ లో విలీనం అయితే.. ఆ ప్రభావం రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఉంటుంది. వైఎస్ .. తన జీవితాంతం కాంగ్రెస్ నే అంటి పెట్టుకుని ఉన్నారు. కాంగ్రెస్ వల్లే ఆయనకు అత్యున్నత పదవులు లభించాయి. అయితే ఆయన చనిపోయిన తర్వాత.. సోనియాపైనే జగన్ కుటుంబం దారుణ నిందలు మోపింది . వైఎస్ మరణం వెనుక సోనియా హస్తం ఉందని కూడా ఆరోపించారు. తమపై అక్రమ కేసులు పెట్టించారని కూడా విమర్శించారు. సొంత పార్టీ పెట్టి కాంగ్రెస్ ను పూర్తి స్థాయిలో నిర్వీర్యం చేశారు. ఇప్పుడు వైఎస్ కుటుంబం నుంచే అదీ కూడా వైఎస్ వారసుల్లో ఒకరు కాంగ్రెస్ చేరడం చిన్న విషయం కాదని.. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఓటు బ్యాంక్‌ను దగ్గరకు తీసుకోవడానికి ఇవి ఇవి ఉపయోగపడాయని అనుకుంటున్నారు.ఇప్పటి వరకూ జూలై ఎనిమిదో తేదీన సోనియా, రాహుల్ ఇడుపులపాయకు వస్తారన్న క్లారిటీ లేదు. అదే జరిగితే మాత్రం.. తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ మళ్లీ పుంజుకోవడానికి ప్లాన్లు అమలు చేయడం ప్రారంభించిందని అనుకోవచ్చు.

## కాంగ్రెస్ లో చేరడమంటే
# బీఆర్ఎస్ కు సహకరించినట్లే

(మొదటిపేజీ తరువాయి)

లోకేనని చెప్పారు. కేసీఆర్ ను ఓడించాలి... ప్రజలను ఆదుకోవాలనే లక్ష్యంతో పనిచేస్తున్న నాయకులంతా ఈ విషయంపై ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. లిక్కర్ నిందితులు తప్పించుకునే వీల్లేకుండా పకడ్బందీగా ఆధారాలు సేకరించే పనిలో సీబీఐ, ఈడీ నిమగ్నమై ఉందన్నారు. 9 ఏళ్లుగా ప్రజలను పట్టించుకోని కేసీఆర్ ప్రచారం కోసం వెయ్యి కోట్ల ప్రజా ధనాన్ని ఖర్చు చేస్తూ ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. ఏనాడూ అమరవీరుల కుటుంబాల ముఖం చూడని కేసీఆర్.. ఇయాళ పిలిచి సన్మానం చేయడం.. శంకరమ్మకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం వెనుక పెద్ద జిమ్మిక్కు అని అన్నారు. “మహా జనసంపర్క్ అభియాన్”లో భాగంగా బండి సంజయ్ గురువారం కరీంనగర్ లోని చైతన్యపురి, జ్యోతినగర్ కాలనీల్లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి పేరుపేరునా పలకరిస్తూ నరేంద్రమోదీ గారి ప్రభుత్వం గత 9 ఏళ్లలో సాధించిన విజయాలు, చేపట్టిన అభివృద్ధి, పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. స్టిక్కర్లను స్వయంగా అంటించారు.

## జో బైడెన్‌తో ప్రధాని మోదీ భేటీ
# రక్షణ రంగంలో కీలక ఒప్పందాలు

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..స్ట్రైకర్, ఓ777 లైట్ వెయిట్ హోవిట్జర్ అప్‌గ్రేడేషన్‌పై తుది నిర్ణయం జూ అందించే షరతులపై ఆధారపడి ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ పర్యటనలో రక్షణవ్యవస్థకు సంబంధించిన పరికరాల ఒప్పందం ముఖ్యమైనదికాగా..భారత్‌లో 2.7 బిలియన్ డాలర్ల చిప్ ప్లాంట్ కోసం మైక్రోన్‌తో ఒప్పందం, క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి పలు కీలక అంశాలపై ఈ పర్యటనలో ఒప్పందాలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు.జనరల్ డైనమిక్స్ ల్యాండ్ సిస్టమ్స్‌తో తయారు చేయబడిన స్ట్రైకర్ అనేది ఎనిమిది చక్రాల ఎ-హల్ సాయుధ పదాతిదళ వాహనం. ఈ స్ట్రైకర్‌లో 30 ఎఎ ఫిరంగి, 105 ఎఎ మొబైల్ గన్‌తో ఆయుధాలు ఉంటాయి. దీనిని ఆఫ్ఘనిస్తాన్‌లోని తాలిబాన్‌లను ఎదుర్కోవడానికి జూ సైన్యం వినియోగించింది. యూఎస్ దీనిని భారత్ అందిస్తోంది. ఆత్మ నిర్భర్‌లో భాగంగా భారత్ దీనిని స్వదేశీ తయారీపై ఆసక్తి చూపుతోంది.

## మళ్లీ గెలిపిస్తే
# పటాన్‌చెరు టూ హయత్ నగర్ మెట్రో





(మొదటిపేజీ తరువాయి)

మెట్రో వ్యవస్థను పటాన్‌చెరు వరకు విస్తరిస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయమై కేసీఆర్ మాట్లాడుతూ.. 'పటాన్‌చెరు వరకు మెట్రో కావాలని అడుగుతున్నారు. తప్పకుండా మెట్రో పటాన్‌చెరు వరకు రావాలి. హైదరాబాద్ సిటీలో ఎక్కువగా ట్రాఫిక్ ఉండే కారిడార్ పటాన్‌చెరు నుంచి హయత్ నగర్ వరకు ఉంటుంది. కాబట్టి పటాన్‌చెరు నుండి హయత్ నగర్ వరకు కచ్చితంగా మెట్రో వచ్చి తీరుతుంది. అయితే మీరు మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపిస్తే వచ్చి తీరుతుంది. మళ్లీ ప్రభుత్వం ఏర్పడగానే మొట్ట మొదటి క్యాబినేట్ మీటింగ్‌లో పటాన్‌చెరు నుంచి హయత్ నగర్ మెట్రో రైలుకు ఆమోద ముద్ర వేస్తామని మాటిస్తున్నాను. అందులో ఏమాత్రం సందేహం లేదు. రాష్ట్రం ఏర్పడే క్రమంలో అనేకమైనటువంటి అపవాదులు, అనేకమైన అపోహలు, అనుమానాలు కలిగించారు. తెలంగాణ చిమ్మని చీకటవుతుంది.. కరెంటు రానే రాదన్నారు. పటాన్‌చెరులో అప్పుడు పరిశ్రమల వారు కరెంటు కావాలని సమ్మెలు చేసేవారు. ఇవాళ మూడుషిఫ్టుల్లో పరిశ్రమలు నడుస్తున్నయ్. భారతదేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో పరిశ్రమలకు 24 గంటల కరెంటు ఇస్తున్నాం. ఎన్ని కష్టాలు, నష్టాలకోర్చి పరిశ్రమలు, డొమెస్టిక్, గృహాలకు, కమర్షియల్, వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇచ్చే రాష్ట్రం తెలంగాణ. ఇంటింటికీ నల్లాపెట్టి నీళ్లిచ్చే రాష్ట్రం తెలంగాణ. తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ నెంబర్ వన్ తెలంగాణ. ఎందుకు గొర గాకుండా పోతారని ఎవరైతే శాపాలు పెట్టారో వారిని మించిపోయి 3.17 లక్షలతో పర్క్యాపిటా ఇన్‌కంలో దేశంలో తెలంగాణ నెంబర్ వన్ స్థాయికి చేరుకున్నాం' అన్నారు.

' ఈ ప్రగతి అంతా మీ అందరి ప్రేమ, మద్దతు, కార్మికుల కృషి, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధుల కృషితో ఇదంతా సాధించాం. మెట్రోరైల్ సంగారెడ్డికి రావాలంటున్నారు. తప్పనిసరిగా రావాలి. ఇటీవల విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నియోజకవర్గానికి వెళితే.. మహేశ్వరానికి మెట్రో రావాలని కోరారు. అక్కడే ఆ సభలోనే నేను చెప్పాను. హైదరాబాద్ సిటీలో అత్యధికంగా ట్రాఫిక్ ఉండే కారిడర్ పటాన్‌చెరు నుంచి దిల్‌సుఖ్‌నగర్. పటాన్‌చెరువు నుంచి హయత్‌నగర్ వరకు మెట్రోరావాల్సి ఉంది.

మళ్లీ ఎన్నికల్లో గెలిస్తే మెట్రో తప్పకుండా వస్తుంది. మళ్లీ వచ్చే ప్రభుత్వం తొలి కేబినెట్ సమావేశంలో పటాన్‌చెరు నుంచి హయత్‌నగర్ మెట్రోరైలుకు మంజూరు ఇప్పిస్తానని వ్యక్తిగతంగా వాగ్ధానం చేస్తున్నానన్నారు. స్థానిక ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పారిశ్రామిక ప్రాంతానికి ప్రత్యేకంగా పాలిటెక్నిక్ కావాలని అడిగారు. ఇవాళనే మంజూరు చేస్తూ జీవో జారీ చేస్తాం. ఈ ప్రాంతంలో విపరీతమైనటువంటి కాలనీలు వస్తున్నయ్. ఇప్పుడే కొల్లూరులో 17వేలపైచీలుకు డబుల్ రూం ఇండ్లకు ప్రారంభోత్సవం చేశాం. పటాన్‌చెరుకు 2వేల ఇండ్లు కేటాయిస్తున్నాం' అన్నారు. 'పటాన్‌చెరులో పరిశ్రమలు బాగా నడుస్తున్నయ్. ఒక కండ్ల అద్దాలు తయారు చేసే.. మెడికల్ డివైజెస్ పార్క్ వస్తే.. ఆ ఒక్క పార్కులో 15వేల మంది పని చేస్తున్నారని చెప్పడం సంతోషమనిపిస్తుంది. పటాన్‌చెరు ఇంకా అభివృద్ధి చెందాలి. ఇక్కడికి ఐటీ ఇండస్ట్రీని మంత్రి కేటీఆర్‌ను పంపిస్తాను. త్వరలో ఐటీ కంపెనీలు వచ్చేలా ఏర్పాట్లు చేస్తాం. భూపాల్‌రెడ్డి పదేపదే కోరుతున్నారు. రామసముద్రం చెరువు సుందరీకరించి గొప్పగా చేయాలని కోరుతున్నారు. ఇరిగేషన్ శాఖ నుంచి నిధులు మంజూరు చేయాలని హరీశ్‌రావుకు సూచిస్తున్నా. సిద్దిపేట కోమటిచెరువు తరహాలో అభివృద్ధి చేస్తాం. కాలనీలు వచ్చిన వెంటనే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రాదు. అదనంగా సహాయం కావాలని ఎమ్మెల్యే కోరుతున్నారు.

మూడు మున్సిపాలిటీలకు రూ.30కోట్ల నిధులు, మూడు డివిజన్లకు రూ.30కోట్లు కేటాయిస్తున్నాం. 55 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకంగా అభివృద్ధి కోసం సీఎం ఫండ్ నుంచి రూ.15లక్షలు మంజూరు చేస్తున్నాం. ఎప్పటి నుంచో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి రెవెన్యూ డివిజన్ కావాలని కోరుతున్నారు. త్వరలోనే రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తాం. మాజీ సీఎస్ రాజీవ్‌శర్మకు నేను ధన్యవాదాలు చెప్పాలి. పదవీ విరమణ చేశాక నా కోరిక మేరకు పొల్యూషన్ బోర్డ్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఈ ప్రాంతంలో పొల్యూషన్ రాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ఇక్కడ సూపర్ స్పెషల్ హాస్పిటల్ వచ్చేలా రాజీవ్ శర్మ చొరవ చూపారు. మనం కడుతున్న డబుల్ బెడ్రూం ఇండ్లు భారత్‌లో ఎక్కడా ఉండవ్. మంచినీళ్ల సరఫరా ఎక్కడా కనిపించదు. అద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టు తీసుకొని రాష్ట్రంలో నీళ్ల కరువు లేకుండా మటుమాయం చేసుకున్నాం. ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేసుకోవాల్సి ఉంది' అని కేసీఆర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అడిగిన మేరకు పాలిటెక్నిక్ కళాశాలకు ఈరోజు జీవో జారీ చేస్తాము' అని చెప్పుకొచ్చారు. కేసీఆర్ ఇంకా మాట్లాడుతూ.. పటాన్‌చెరులో ఐటీ పరిశ్రమలు తీసుకొస్తాం.

ఈ విషయమై కేటీఆర్‌తో మాట్లాడుతాను. పటాన్‌చెరు ఇంకా అభివృద్ధి చెందాలి. రామసముద్రం చెరువు సుందరీకరణ పనులు చేపట్టాలని అధికారులు సూచించారు. తెలంగాణ ఏర్పడక ముందు ఆంధ్రలో ఎకరం భూమి అమ్మితే తెలంగాణలో 5, 6 ఎకరాలు కొనుక్కునేటోల్లం , కాని ఇప్పుడు తెలంగాణలో ఎకరం భూమి అమ్మి ఏపీలో 50 నుంచి 100 ఎకరాలు భూమి కొంటున్నారని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఇటీవల చంద్రబాబు నాయుడు అన్న ఆ మాటలను ఇప్పుడు కేసీఆర్ ఉటంకించారు. ఏపీలో సీఎం జగన్ వల్ల సంపద నాశనం అయిపోయిందని, భూముల రేట్లు పడిపోయాయని ఇటీవల చంద్రబాబు ఓ రోడ్ షోలో అన్నారు. గతంలో ఏపీలో ఎకరం అమ్మితే తెలంగాణలో పదుల సంఖ్యలో ఎకరాలు కొనేవాళ్లని, జగన్ వచ్చాక పరిస్థితి తారుమారైందని విమర్శించారు.

తాజాగా చంద్రబాబు మాటలను పటాన్‌చెరు పర్యటనలో భాగంగా కేసీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ బంగారు తెలంగాణ అవుతుందనడానికి ఇదే నిదర్శనం అని అన్నారు. పటిష్ఠ నాయకుడు, నాయకత్వం ఉంటే అన్నీ సాధ్యమవుతాయని కేసీఆర్ అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. రూ.183కోట్లతో నిర్మించనున్న 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఇక్కడ కట్టనున్నారు. భూమిపూజ కార్యక్రమంలో పాల్గొని ఆసుపత్రి నిర్మాణానికి పునాదిరాయి వేశారు.

# హుస్సేన్ సాగర్ ఒడ్డున అమర దీపం

(మొదటిపేజీ తరువాయి)

సాగర్ తీరాన లుంబినీ పార్కు సమీపంలో 3.29 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఇందు కోసం కేటాయించింది. ఈ స్థలంలో 26,800 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్రమిద ఆకారంలో అమరవీరుల స్మారక భవనాన్ని నిర్మించారు. 54, 37 అక్షాల పొడవుతో దీర్ఘవృత్తాకారంలో ప్రమిదను రూపొందించారు. దీనికి ఒక వైపు 26 మీటర్ల ఎత్తు, మరో వైపు 18 మీటర్ల ఎత్తుతో, మొత్తంగా గ్రౌండ్ లెవల్ నుండి 45 మీటర్ల ఎత్తులో దీపం ప్రకాశిస్తూ ఉంటుంది. స్మారక భవనం నిర్మాణానికి మొత్తంగా 1,600 మెట్రిక్ టన్నుల స్టెయిన్ లెస్ స్టీల్ ను వినియోగించారు.

**అంతస్తుల వారీగా వివరాలు:** బేస్ మెంట్ ? 1: దీని విస్తీర్ణం 1,06,993 చదరపు అడుగులు. 160 కార్లు, 200 ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ సౌకర్యం వుంది.

బేస్ మెంట్ ? 2: ఇది 1,06,993 చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మితమైంది. 175 కార్లు, 200 ద్విచక్రవాహనాలకు పార్కింగ్ సౌకర్యం. లాంజ్ ఏరియా, లిఫ్ట్ లాబీ, భూగర్భంలో 3 లక్షల లీటర్ల నీటి సామర్థ్యమున్న సంప్ (నీటి గుంట)లను ఏర్పాటు చేశారు.

**గ్రౌండ్ ఫ్లోర్:** దీని విస్తీర్ణం 28,707 చదరపు అడుగులు. ఇందులో మెయింటనెన్స్, సివిల్, ఎలక్ట్రికల్ కార్యకలాపాలు.

**మొదటి అంతస్తు:** దీని విస్తీర్ణం 10,656 చదరపు అడుగులు. ఇందులో మ్యూజియం, ఫోటో గ్యాలరీ, 70 మంది కూర్చునే సామర్థ్యంతో ఆడియో, విజువల్ రూమ్.

రెండవ అంతస్తు: దీని విస్తీర్ణం 16,964 చదరపు అడుగులు. కన్వెన్షన్ హాల్, లాబీ ఏరియా.

**మూడవ అంతస్తు (టెర్రస్):** దీని విస్తీర్ణం 8,095 చదరపు అడుగులు. కూర్చునే ప్రదేశం, ప్యాంట్రీ ఏరియాతో కూడిన రెస్టారెంట్, వ్యూ పాయింట్, ఓపెన్ టెర్రస్ సీటింగ్ వున్నాయి.

**మెజ్జనైన్ ఫ్లోర్:** దీని విస్తీర్ణం 5,900 చదరపు అడుగులు. గ్లాస్ రూఫ్ తో కూడిన రెస్టారెంట్, ఓవర్ హెడ్ ట్యాంకు

**అమర దీపం:** తక్కువ కార్బన్ స్ట్రక్చరల్ స్టీల్ తో తయారైన 26 మీటర్ల జ్వాల. ఇది గోల్డెన్ ఎల్లో కలర్ లో ప్రకాశిస్తుంది.

# మీర్‌పేటలో ఘనంగా దశాబ్ది ఉత్సవాలు

రంగారెడ్డి – ప్రభాత సూర్యుడు

దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్పేట మున్సిపల్ కార్పొరేషన్ చందనం చెరువు సమీపంలో అమరవీరుల స్తూపానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, అనంతరం బాలాపూర్ చౌరస్తాలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ నేటి తెలంగాణ అమరవీరుల త్యాగ ఫలితం తెలంగాణ రాష్ట్రం తెలంగాణ ప్రజల కల సకారం అయిందని మంత్రి తెలిపారు సూర్య చంద్రులు ఉన్నంతకాలం తెలంగాణ రాష్ట్రం సాధన కోసం అమరులైన అందరిని చిరస్థాయిగా స్మరించుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దుర్గా దీపు లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, కార్పొరేటర్లు,ఉద్యమ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సీట్ల అమ్మకమే లక్ష్యంగా
# ఐటీ రైడ్స్

(మొదటిపేజీ తరువాయి)

ఇళ్లలోనూ సోదాలు జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. ఎస్వీఎస్ మెడికల్ కాలేజీ, మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కాలేజీ, ప్రతిమా కార్పొరేట్ కార్యాలయాల్లో జరుగుతున్నాయి ప్రతిమా గ్రూప్‌కి చెందిన ఆర్థిక లావాదేవీలను కూడా బయటకు తీస్తున్నారు. హైదరాబాద్ నగరంతో పాటు మహబూబ్‌నగర్ ,నల్లగొండ , రంగారెడ్డి ,మేడ్చల్ జిల్లాల్లో ఈడీ రైడ్స్ జరుగుతున్నాయి. ముంబైలో ఃఓఅ కేంద్రంగా జరిగిన అక్రమాలపై దేశవ్యాప్తంగా ఈడి సోదాలు నిర్వహిస్తోంది. కోవిడ్ సమయంలో హైదరాబాద్ హాస్పిటల్స్ నుండి ముంబై ఃఓఅ కు మెడికల్ కిట్స్ సప్లై అయిన క్రమంలో జరిగిన అక్రమాలు ఈ సోదాలకు కారణంగా తెలుస్తోంది. భారీగా నిధులు మళ్లింపు జరిగినట్టు ఈడి అభియోగంతో ఈ దాడులు జరుగుతున్నాయి. మెడికల్ కాలేజీల్లో భారీగ అవకతవకలు జరిగాయని మరి ముఖ్యంగా ఫీజుల వసూళ్ల విషయంలో అక్రమాలు జరిగాయని తెలుస్తోంది. హైదరాబాద్ మెడికల్ కాలేజీలకు సంబంధించిన సంస్థలు రూ.12వేల కోట్ల స్కామ్ లో ఇరుక్కున్నట్లుగా తెలుస్తోంది. కొన్నాళ్ల కిందట ఐటీ అధికారులు తెలంగాణ మంత్రి మల్లారెడ్డికి చెందిన ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీల్లో సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో మెడికల్ సీట్ల కోసం అనధికారికంగా పెద్ద ఎత్తున నగదు తీసుకున్నారని.. వాటిపై దర్యాప్తు చేయాలని ఈడీకి ఐటీ అధికారులు లేఖ రాశారు. కానీ ఇప్పటి వరకూ ఈడీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఐటీ అధికారులు రాసిన లేఖల ఆధారంగా ఈడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారా లేకపోతే.. ముంపై బీఎంసీ స్కామ్ ఆధారాంగా అన్నది తెలియాల్సి ఉంది. మెడికల్ కాలేజీలకు సంబంధించిన వ్యవహారం కావడంతో.. సుదీర్ఘంగా సోదాలు ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## సంపాదకీయం

# ఆశలు రేపుతున్న మోడీ టూర్

నరేంద్ర మోడీ అమెరికాలో పర్యటిస్తున్నారు. సతీసమేతంగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఇచ్చిన ఆహ్వానం యూఎస్ లో పర్యటన కొనసాగుతోంది. ప్రధానిమోదీకి వైట్ హౌస్ వద్ద అద్భుతమైన స్వాగతం లభించింది. న్యూయార్క్ పర్యటన ముగించుకుని వాషింగ్టన్ డీసీకి చేరుకున్న మోదీకి అమెరికా అధికారులు, భారత రాయబారులు ఎయిర్ పోర్ట్ లో ఘన స్వాగతం పలికారు. మోదీ వాష్టింగ్టన్ చేరుకునే సరికి వర్షం పడుతుండగా..ఆ వర్షంలో తడుస్తూనే తనకు స్వాగతం పలికేందుకు వచ్చిన చిన్నారులను, ప్రవాస భారతీయులను మోదీ పలకరించారు.అక్కడి నుంచి వైట్ హౌస్ కు చేరుకున్న ప్రధాని మోదీకి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ప్రథమ మహిళ జిల్ బైడెన్ ఘనంగా స్వాగతం పలికారు. మోదీని ఆత్మీయంగా పలకరిస్తూ వైట్ హౌస్ లోకి తీసుకువెళ్లారు. వైట్ హౌస్ అధికారికంగా మోదీ కోసం అఫీషియల్ డిన్నర్ ను ఏర్పాటు చేసిందిఅమెరికాతో సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం, ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయటంలో భాగంగా ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలను మరింతగా మెరుగుపర్చడం, ప్రజాస్వామ్య విలువలు, అచంచలమైన నిబద్ధతతో ప్రపంచ శాంతి, శ్రేయస్సుకు తోడ్పడటం వంటివి ప్రధాని అమెరికా పర్యటనలో ప్రధాన అంశాలు కానున్నాయి. రక్షణ, కృత్రిమ మేధస్సు, అంతరిక్ష రంగం, క్వాంటమ్ కంప్యూటింగ్, టెలికమ్యూనికేషన్ వంటి రంగాల్లో భారత్‌కు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని అందించడానికి అడ్డుగా ఉన్న ఆంక్షలను సడలించడం, ఆర్థిక మాంద్యం, ఉక్రెయిన్–రష్యా యుద్ధం వంటి కీలకమైన అంశాలు ఇద్దరు నేతల మధ్య చర్చకొచ్చే అవకాశం ఉంది. భారతదేశ విదేశాంగ విధానం ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు ఎంతో వ్యూహాత్మకంగా, బలంగా మారింది. దాదాపు అన్ని అభివృద్ధి చెందిన దేశాలతో ఇండియా సత్సంబంధాలు కొనసాగించాలని కోరుకుంటోంది. భారత ప్రధాని అమెరికా పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య రక్షణ శాస్త్ర సాంకేతిక, వాణిజ్య రంగాలు కొత్త పుంతలు తొక్కనున్నాయని భావిస్తున్నారు. అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సుల్లివన్ భారత జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్‌తో మోదీ– బైడెన్ భేటీకి సంబంధించిన ఏర్పాట్లపై విస్తృత స్థాయిలో చర్యలు జరిపారు. ఏడు రంగాల్లో భాగస్వామ్యం కోసం భారత్, అమెరికాలు ఒక రోడ్ మ్యాప్‌ను ఆవిష్కరించాయి. కృత్రిమ మేధస్సు, క్వాంటమ్ కంప్యూటింగ్, సెమీకండక్టర్స్, టెలిక మ్యూనికేషన్స్, డిఫెన్స్ అండ్ స్పేస్ వంటి రంగాల్లో సహకారం అందించడం, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ తయారు చేసే యుద్ధ విమానాలకు శక్తినిచ్చే ఇంజిన్‌లను భారతదేశంలో ఉత్పత్తి చేయడానికి జనరల్ ఎలక్ట్రిక్‌తో మల్టీ మిలియనీర్ డాలర్ ఒప్పందంపై ఆమోదం, సెమీకండక్టర్ల తయారీకి ఎంఓయూ, సెమీకండక్టర్ల తయారీపై ఉమ్మడి ప్రాజెక్టులు, సాంకేతిక భాగస్వామ్యాలకు మార్గం సుగమం చేసే అవగాహన ఒప్పందం యూఎస్ నుంచి భారత్‌కు హై–పర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ టెక్నాలజీ, సోర్స్ కోడ్‌ను ఎగుమతి చేయడంలో ఉండే అడ్డంకులను తగ్గించడం, రెండు దేశాల మధ్య రక్షణ వాణిజ్యం, పెట్టుబడుల్లో ఉన్న అడ్డంకులను తొలగించడం, ఆయుధాలను తీసుకుని వెళ్లగలిగే సామర్థ్యంతో ఉండే దాదాపుగా 30 వరకూ సాయుధ ఎంక్యూ 9బి సీగార్డియన్ డ్రోన్ల తయారీ… ఆయుధ, రక్షణ పాటవ అంశాలపై సహకారం, గ్రౌండ్ వెహికిల్స్ సహ నిర్మాణానికి సంబంధించిన ఒప్పందంపై సంతకాలు చేసే అవకాశం ఉంది.అమెరికాలో స్టేట్ విజిటింగ్‌కు వెళ్లనున్న మూడో ఇండియన్ లీడర్‌గా ప్రధాని మోడీ నిలవనున్నారు. గతంలో 1963 జూన్‌లో నాటి భారత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్, 2009 నవంబర్‌లో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఇలాంటి పర్యటనలకు వెళ్ళారు. అమెరికా కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో రెండుసార్లు ప్రసంగించిన మొదటి భారత ప్రధానిగా మోదీ నిలవనున్నారు. అధ్యక్షుడు బైడెన్, ప్రథమ మహిళ 21–గన్ సెల్యూట్‌తో స్వాగతం పలుకుతారు.ఈ పర్యటనలో వాషింగ్టన్‌లోని జాన్ ఎఫ్.కెన్నెడీ సెంటర్‌లో అమెరికా అగ్రశ్రేణి కంపెనీల చైర్‌పర్సన్స్, సీఈవోలతో ప్రధాని మోదీ సమావేశం అవుతారు. యునైటెడ్ స్టేట్స్ కాంగ్రెస్ జాయింట్ సెషన్‌లో ప్రసంగిస్తారు. ఇది ద్వైపాక్షిక సంబంధాల బలాన్ని సూచిస్తుంది. రక్షణ రంగ ఉత్పత్తుల అభివృద్ధి, తయారీలోని అన్ని అంశాలపైనా మోదీ, బైడెన్‌ల భేటీ దృష్టి సారించనుంది. ప్రస్తుతం ఉన్న దాని కంటే మరింత మెరుగైన పారిశ్రామిక వ్యవస్థలను ఏర్పాటు చేయడంలో సహకారంపై చర్చి ంచనుంది. రక్షణ రంగంలో సరఫరా వ్యవస్థల మెరుగుదల పైనా భేటీ దృష్టి సారించనుంది. సైనిక దళాల మధ్య సంబంధాలు పెరిగాయి. ప్రధాని అగ్రరాజ్య పర్యటన భారత్–అమెరికాల మధ్య రక్షణ,శాస్త్ర సాంకేతిక రంగాలే కాకుండా వర్తక వాణిజ్యాలు విదేశీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో సాగుతుందనే చెప్పాలి. ఈ నేపథ్యంలో అమెరికా కాంగ్రెస్ లో భారత ప్రధాని చేసే ప్రసంగం గూర్చి యావత్ ప్రపంచం ఎదురుచూస్తోంది. ప్రపంచ శాంతి పర్యావరణ పరిరక్షణ, రక్షణ శాస్త్ర సాంకేతిక రంగాలలో పరస్పర సహకారం, సమాచార రంగంలో రానున్న కాలంలో వినియోగించే సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, విద్య వైద్య రంగాలలో పరిశోధనలు అలోచనలు, ఆవిష్కరణలు విజ్ఞాన మార్పిడి కృతిమ మేధస్సు వినియోగం వాటి సవాళ్ళు అంతరిక్ష రంగంలో పరస్పర సహకారం, ఉగ్రవాద నిర్మూలన, సేంద్రియ వ్యవసాయం, సాంస్కృతిక ఆంశాలే కాకుండా ఐక్యరాజ్య సమితి భద్రతామండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కోసం రాజీలేని బేషరతు మద్దతు కోరే అవకాశం లాంటి అనేక అంశాలు ప్రస్తావించాలి. ఈ వేదిక సాక్షిగా భారతదేశం రానున్న కాలంలో అన్ని రంగాలలో బలమైన ప్రబలమైన ప్రభావశాలిగా అభివృద్ధి పథంలో దూసుకు పోగలదన్న సందేశాన్ని వినిపించాలి. ఐక్యరాజ్య సమితిలో భారత దేశానికి శాశ్వత సభ్యత్వం ఇచ్చే విషయంలో సుముఖంగా వున్నట్లు ప్రకటనలకు మాత్రమే పరిమితమైన అమెరికా ఈ విషయంలో చిత్తశుద్ధితో మెలిగి సహకరించాలి. ఆరమరికలు లేని, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం కావడానికి మోదీ పర్యటన కారకం కావాలి.

# యువత చుట్టూ టీ రాజకీయాలు

(మొదటిపేజీ తరువాయి)
ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నిస్తుంది. బీజేపీకి కూడా యువత లక్ష్యంగా ప్రణాళికలు చేస్తుంది. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో అధికారంలో బీఆర్‌ఎస్… ఆ హామీలు విస్మరించిందని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ పేరుతో యువతలో భరోసా నింపేందుకు ప్రయత్నిస్తుంది.టీఎస్పీఎస్సీ పేపర్ల లీకేజీ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం అయిన విషయం తెలిసిందే. పోటీ పరీక్షలను సక్రమంగా నిర్వహించలేదని విమర్శలు వచ్చాయి. పేపర్ల లీకేజీతో చాలా పరీక్షలు రద్దయ్యాయి. యువతను తమ వైపు తిప్పుకునేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం వరుసగా నోటిఫికేషన్లు విడుదల చేసినప్పటికీ లికేజీతో యువతలో గందరగోళం నెలకొంది. తెలంగాణలో 80 వేలకు పైగా ఖాళీలను భర్తీ చేస్తామని ఇప్పటికే సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇందుకు సంబంధించి పలు నోటిఫికేషన్లు ఇప్పటికే వెలువడ్డాయి. పేపర్ల లికేజీతో ఈ నోటిఫికేషన్ల భర్తీ ప్రక్రియ కాస్త ఆలస్యంగా కొనసాగుతుంది. హైదరాబాద్ యువతకు ఉద్యోగాల కల్పనలో కీలకంగా మారింది. ఐటీ, ఫార్మా రంగాలతో పాటు ఇతర ప్రైవేట్ సంస్థలు యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తు?న్నామని బీఆర్‌ఎస్ ప్రభుత్వం చెబుతుందిఈ తరుణంలో కాంగ్రెస్ కూడా యువత లక్ష్యంగా హామీలు ఇస్తుంది. యువత కోసం కాంగ్రెస్ పార్టీ యూత్ డిక్లరేషన్ ప్రకటించింది. కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ తెలంగాణ యువతకు పార్టీ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. హైదరాబాద్ సభలో ప్రియాంక గాంధీ విడుదల చేసిన డిక్లరేషన్ ఆసక్తిగా మారింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేసి తీరుతామని ప్రియాంక గాంధీ సరూర్ నగర్ సభలో తెలిపారు. తాము మాట తప్పితే తమను గద్దె దించాలని సూచించారు. యూత్ డిక్లరేషన్ కు జవాబుదారీగా ఉంటామని పేర్కొన్నారు. తను సోనియాగాంధీ కుమార్తెనని నిజాయితీతో ఈ మాటలు చెబుతున్నానని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు.

యూత్ డిక్లరేషన్ లో భాగంగా..తెలంగాణ తొలి, మలి విడత ఉద్యమాల్లో ప్రాణాలర్పించిన యువతీ, యువకులను అమరవీరులుగా గుర్తించి వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని ప్రకటించారు. దీంతో పాటుగా తల్లి, తండ్రి లేదా భార్యకు రూ 25 వేల అమర వీరుల గౌరవ పెన్షన్ ఇస్తామని ప్రకటించారు.తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న యువతపై నమోదైన కేసులను ఎత్తివేయటంతో పాటుగా జూన్ 2న వారికి తెలంగాణ ఉద్యమకారులుగా ప్రభుత్వ గుర్తింపు కార్డులు అందిస్తామని యూత్ డిక్లరేషన్ లో వెల్లడించారు. దీంతో పాటుగా పార్టీ అధికారంలోకి వస్తే తొలి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. మొదటి ఏడాదిలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి హామీ ఇచ్చారు. ప్రతీ ఏడాది జూన్ 2 నాటికి అన్ని శాఖల్లోని ఖాళీలతో జాబ్ క్యాలెండర్ ప్రకటించి..సెప్టెంబర్ 17 లోగా నియామకాల పూర్తి చేస్తామని స్పష్టంగా పార్టీ ప్రకటించింది. నిరుద్యోగ యువతకు ఉద్యోగ..ఉపాధి అవకాశాలను కల్పించే వరకు ప్రతీ నెలా రూ.4 వేల చొప్పున నిరుద్యోగ భృతి చెల్లింపు పైన హామీ ఇచ్చారు. ప్రత్యేక చట్టంతో టీఎస్పీఎస్సీని ప్రక్షాళన చేసి యూపీఎస్సీ తరహాలో పునరుద్దరిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది.మరోవైపు బీజేపీ కూడా యువత ఓటు బ్యాంకుపై దృష్టి పెట్టింది.

తెలంగాణలో అధికారంలోకి వస్తే 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. బిస్వాల్ కమిటీ నివేదిక ప్రకారం రెండు లక్షల ఖాళీల భర్తీ ప్రక్రియ చేపడతామని అంటోంది. ప్రతి సంవత్సరం ఉద్యోగాల ఖాళీల వివరాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి భర్తీ చేపడతామని తెలిపింది.తెలంగాణలో ప్రధాన పార్టీలు యువతే లక్ష్యంగా ప్రణాళికలు చేస్తున్నాయి. అయితే యువత ఎవరి డిక్లరేషన్ మెచ్చి ఓట్లు కురిపిస్తారో… వచ్చే ఎన్నికల వరకూ ఆగాల్సిందే.

# అమరుల ఆశయ సాధన దిశగా మనమంతా కృషి చేయాలి

### జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



**జయశంకర్ భూపాలపల్లి – ప్రభాత సూర్యుడు :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణ త్యాగాలు చేసిన అమరుల ఆశయాల సాధనకు మనమంతా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు చివరి రోజులో భాగంగా గురువారం భూపాలపల్లి నియోజకవర్గ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గల అమరుల స్థూపం వద్ద నిర్వహించిన అమరుల సంస్మరణ దినోత్సవంలో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి లు పాల్గొని అమరవీరుల స్థూపం కు పూలమాలలు వేసి అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అక్కడ నిర్వహించిన కార్యక్రమంలో అమరులను స్మరించుకుంటూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించి జాతీయ గీతాన్ని ఆలపించినారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ అయితే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి తొమ్మిది సంవత్సరాలలో సాధించిన ప్రగతిని వివరిస్తూ గత 20 రోజులుగా జిల్లాలోని ప్రతి గ్రామంలో మున్సిపాలిటీలో వివిధ శాఖల ద్వారా దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించామని అన్నారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా వివిధ శాఖల ద్వారా దేశానికి ఆదర్శంగా రాష్ట్రంలో జరుగుతున్న పాలనను వివరించామని, అన్ని రంగాలలో రాష్ట్రం అభివృద్ధి సాధిస్తూ అమరుల ఆశా సాధన దిశగా పయనిస్తుందని కలెక్టర్ తెలిపారు. అమరవీరులను ప్రజలంతా శాశ్వతంగా స్మరించుకునే విధంగా సీఎం కేసీఆర్ హైదరాబాదులో అమరవీరుల స్మారక భవనాన్ని అద్భుతంగా నిర్మించారని, అద్భుత పర్యాటక కేంద్రంగా అమరవీరుల స్మారక చిహ్నం నిలిచి అమరుల త్యాగాలను నిరంతరం ముందు తరాలకు తెలియజేస్తూ ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అమరుల ఆశయాల సాధన దిశగా మనమంతా కృషి చేయాలని, వారి ఆశయాలను నిరంతరం నెమరు వేసు కుంటూ ఆ దిశగా మన అందరి ప్రయాణం జరగాలని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి మాట్లాడుతూ 14 సంవత్సరాల పాటు సీఎం కేసీఆర్ నాయకత్వంలో జరిగిన తెలంగాణ ఉద్యమంలో అన్ని వర్గాల వారు పాల్గొన్నారని, ప్రొఫెసర్ జయశంకర్, కొండ లక్ష్మణ బాపూజీ వంటి మహనీయుల సూచనలతో సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమ వేడిని ఢిల్లీకి తాకే విధంగా పోరాడారని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అమరులు త్యాగఫలం, అనేక మంది ఉద్యమకారులు చేసిన త్యాగాల ఫలి తంగా ఏర్పడిందని, వీరి త్యాగాలను మనం నిరంతరం స్మరించుకుంటూ వారి ఆశయ సాధనకు ఐకమత్యంతో కృషి చేయాలని ఆయన తెలిపారు. హైదరాబాదులో అద్భుతంగా అమరుల స్మారక చిహ్నాన్ని నిర్మించి వారి త్యాగాలు శాశ్వతంగా నిలిచిపోయే విధంగా సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దివాకర, భూపాలపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ వెంకట్రామి సిద్దు జిల్లా పరిషత్ వైస్ చైర్పర్సన్ కేశవ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బి రమేష్ గౌడ్ జిల్లా అధికారులు కౌన్సి లర్లు ప్రజాప్రతినిధులు ప్రజలు సిబ్బంది పాల్గొన్నారు.

# సొంత స్థలం ఉంటే రూ.3 లక్షలు మంజూరు

- మహిళల పేరుమీదే సాయం..
- మీకు నచ్చినట్టు.. ఇల్లు కట్టుకోవచ్చు..
- ఈ ఏడాదికి 4,00,000 ఇండ్లు కేటాయింపు
- కుటుంబానికి ఆహార భద్రత కార్డు ఉండాలి.. 80 శాతం బడుగు బలహీన వర్గాలకే
- జిల్లా కలెక్టర్లు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆధ్వర్యంలో దరఖాస్తుల ప్రక్రియ
- రెండు గదులు, టాయిలెట్ తప్పనిసరి..
- రూ.12 వేల కోట్లతో పథకం
- ఇవీ గృహలక్ష్మి పథకానికి మార్గదర్శకాలు

**హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు :** పేదల గృహ నిర్మాణ పథకం 'గృహలక్ష్మి'కి లైన్ క్లియరైంది. పథకం అమలుకు సంబంధించిన మార్గదర్శకాలను బుధవారం ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో ఇక దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానున్నది. సొంత జాగా ఉన్న పేదలకు మూడు దశల్లో రూ.3 లక్షలు (పూర్తి సబ్సిడీ) మంజూరు చేస్తారు. గృహలక్ష్మి పథకం కింద ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.12,000 కోట్లు కేటాయించింది. సొంత జాగా ఉండి ఇల్లు నిర్మించుకోలేని వారికోసం ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా ఒక్కో నియోజకవర్గంలో కనీసం 3,000 ఇండ్ల చొప్పున ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 4 లక్షల ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకొన్నది. మార్గదర్శకాల ప్రకారం.. ఇంటిని లబ్ధిదారు ఇష్టమొచ్చిన డిజైన్‌లో నిర్మించుకోవచ్చు. అయితే, కనీసం 2 గదులు, ఒక టాయ్‌లెట్ కచ్చితంగా ఉండాలి. జిల్లా స్థాయిలో కలెక్టర్, జీహెచ్ఎంసీ పరిధిలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఈ పథకాన్ని అమలుచేస్తారు. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

**జిల్లా మంత్రి ఆధ్వర్యంలో ఇండ్ల మంజూరు:** ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హతలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ అర్హుల జాబితాను సిద్ధం చేస్తారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలో ప్రభుత్వం దశలవారీగా ఇండ్లను మంజూరు చేస్తుంది. మంజూరైన ఇండ్ల కన్నా ఎక్కువమంది దరఖాస్తుదారులు ఉంటే వెయిటింగ్ లిస్ట్‌ను రూపొందించి అనంతరం మంజూరైన ఇండ్లలో ప్రాధాన్యం కల్పిస్తారు. నిర్మాణ పురోగతిని మండల, సర్కిల్ కార్యాలయం క్షేత్రస్థాయిలో పరిశీలించి బిల్లులను జిల్లా కలెక్టర్‌కు పంపిస్తుంది. ఆమోదం తర్వాత రాష్ట్ర నోడల్ అకౌంట్ నుంచి లబ్ధిదారు బ్యాంక్ ఖాతాకు నేరుగా నిధులు బదిలీ అవుతాయి. నిర్మాణ పురోగతి, అయిన వ్యయం ఆధారంగాదశలవారీగా నిధులు మంజూరు అవుతాయి.

**గృహలక్ష్మికి పోర్టల్, యాప్:** గృహలక్ష్మి పథకం అమలుకోసం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ (టీఎస్‌హెచ్‌సీఎల్) ఆధ్వర్యంలో, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సహకారంతో ప్రత్యేకంగా పోర్టల్‌తోపాటు మొబైల్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేస్తారు. ఇండ్ల మంజూరు, బిల్లులకు సంబంధించిన ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లోనే సాగుతుంది. ఇంటి నిర్మాణానికి సంబంధించి బేస్‌మెంట్, రూఫ్ లెవల్, అనంతరం పూర్తయ్యాక మొత్తం మూడు దశల్లో ఫొటోలు తీసుకొని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. బేస్‌మెంట్ స్థాయిలో రూ.లక్ష, రూఫ్ లెవల్ పూర్తయ్యాక రూ.లక్ష, నిర్మాణం పూర్తయ్యాక మిగిలిన రూ.లక్ష మంజూరు చేస్తారు. దీనికోసం ప్రత్యేక బ్యాంక్ ఖాతాను లబ్ధిదారు పేర తెరుస్తారు. జన్‌ధన్ ఖాతాను దీనికి ఉపయోగించరు. టీఎస్‌హెచ్‌సీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ రాష్ట్రస్థాయిలో ఈ పథకం అమలు తీరును పర్యవేక్షిస్తూ ప్రభుత్వానికి నివేదిక అందిస్తారు. పథకం అమలులో ఇబ్బందులు ఎదురైతే అవసరమైన మార్గదర్శకాలు జారీచేసే అధికారాన్ని మేనేజింగ్ డైరెక్టర్‌కు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

## కాంగ్రెస్ నేతల అందోళన..అరెస్టు



**రంగారెడ్డి - ప్రభాత సూర్యుడు :** ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో దశాబ్ది దగా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, నేతలు భారీగా పాల్గొన్నారు. పోలీసులు ప్రదర్శనను అడ్డుకున్నారు. అందోళనకారులు కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేయడాన్ని అడ్డుకున్నారు. మల్రెడ్డి రాంరెడ్డి తో సహా పలువురు నేతలను అరెస్టు చేసి పోలీసు స్టేషన్ కు తరలించారు.

## తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు



**కోరుట్ల - ప్రభాత సూర్యుడు :** తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మెట్ పల్లి పట్టణంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని గురువారం కోరుట్ల నియోజకవర్గం శాసన సభ్యులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఆవిష్కరించారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు తెలంగాణ దశాబ్ది మహోత్సవాలను కోరుట్ల నియోజకవర్గం పరిధిలో నియోజకవర్గ ప్రజలందరి సహకారంతో అంగరంగ వైభవంగా నిర్వహించామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు మున్సిపల్ చైర్మన్ రణవేణి సుజాత - సత్యనారాయణ, వైస్ చైర్మన్ చంద్రశేఖర రావు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరుల త్యాగాలు మరువలేనివి

**- మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్న చిరంజీవి**

**అబ్దుల్లాపూర్‌మెట్ - ప్రభాతసూర్యుడు**




తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎందరో ఆత్మబలి దానాలు చెసుకున్నారని, వారి త్యాగలను తెలంగాణ సమా జం మర్చిపోదని మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్న చిరంజీవి అన్నారు. తెలం గాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం తెలంగాణ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని చైర్‌పర్సన్ స్వప్న ఆద్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధి తట్టి అన్నారం వార్డు కార్యాలయం ఆవరంణంలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్బంగా తెలం గాణ సాధన పోరాటంలో ఆమరుల త్యాగాలను స్మరించు కున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చామ సం పూర్ణ విజయ శేఖర్ రెడ్డి, కమీషనర్ బైరి సత్య నారాయణ రెడ్డి, కౌన్సిలర్‌లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**నిరసన నడుమ కౌన్సిల్ సమావేశం**

గురువారం దశాబ్ది ఉత్సవా అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అమరవీరుల స్థూపానికి కౌన్సిల్ సభ్యులు, అధికారులు నివాళులర్పించారు. అనంతరం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. 13 ఎజెండా అంశాలను ప్రవేశపెట్టగా 12 అంశాలను తీర్మానించినట్లు కమీషనర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. కాగా సమావేశం మధ్యలో 12వ వార్డు కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ ప్లడ్ కార్డుతో నిరసన తెలిపారు. 12వ వార్డుపై పాలకవర్గం మరియూ మున్సిపల్ అధికారులు వివక్ష చూపుతున్నారని, తమ వార్డుకు డ్రైనేజీ, అంగన్‌వాడీ కేంద్రం, వైకుంఠధామం, క్రీడా ప్రాంగణం, రోడ్లు వంటి మౌళిక సదుపాయాలను కేటాయించకుండా వివక్ష చూపుచున్నారని తెలిపారు. చైర్‌ప్సన్, వైస్ చైర్‌పర్సన్, కమీషనర్‌ల చొరవ చేసుకొని సానుకూలంగా స్పందించడంతో నిరసన విరమించుకున్నారు.

## బోనాలు పండుగ అంటే తిని తాగుడు పండుగ: మంత్రి తలసాని

**గోల్కొండ కోట పైన జగదాంబ మహంకాళి అమ్మవారికి బంగారు బోనం సమర్పణ**



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** బోనాల పండుగ మొదలైంది. మొదటి బోనం గోల్కొండ కోట పైన జగదాంబ మహంకాళి అమ్మవారికి సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలోనే నేడు ప్రభుత్వం తరపు నుంచి పట్టు వస్త్రాలను.. బంగారు బోనాన్ని మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇంద్రకరణ్ రెడ్డి, మొహమ్మద్ అలీ సమర్పించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. మహంకాళి జగదంబికా జాతర బోనాల ఉత్సవాలు ఘనంగా ఈ రోజు ప్రారంభం అవుతున్నాయన్నారు. అంగరంగ వైభవంగా తెలంగాణ నడి బొడ్డున జగదంబికా అమ్మవారి బోనాలు నిర్వహిస్తున్నామన్నారు. బోనాలు పండుగ అంటే తిని తాగుడు పండుగ అని తలసాని అన్నారు.సికింద్రాబాద్.. లాల్ దర్వాజ్ హైదరాబాద్ వ్యాప్తంగా బోనాల ఉత్సవాలు జరుగుతాయన్నారు. తెలంగాణ ఆధ్వర్యంలో నిన్న ఢిల్లీలో బోనాలు జరిగాయని తలసాని వెల్లడించారు. తెలంగాణ వచ్చాక రాష్ట్ర పండుగగా బోనాలు జరుపుకుంటామన్నారు. బోనాలు.. తొట్టెలు.. గటాల ఊరేగింపు.. రేపు ఫలహారం బండి., గట్టం.. వంటివి నిర్వహించనున్నారు. భారత దేశంలో హిందువుల గురించి మాట్లాడుతారు కానీ హిందువుల పండుగలకు సహకరించేది కేసీఆరేనన్నారు. పోలీస్ డిపార్ట్మెంట్‌కి అందరూ సహకరించాలన్నారు. అన్ని డిపార్ట్మెంట్ సమన్మయంతో బోనాల జాతర నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్టం ఏర్పడక ముందు అతి తక్కువ మంది తో గోల్కొండ జగదంబికా అమ్మవారి జాతర జరిగేదన్నారు. కానీ ఇప్పుడు లక్ష మందికి పైగా పాల్గొంటున్నారని తలసాని అన్నారు.

## త్యాగఫలం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం

**- ప్రతి రంగంలో తెలంగాణ అద్భుత ప్రగతి సాధించింది**
**అమరుల కుటుంబాలకు అన్ని రకాలుగా ప్రభుత్వం అండగా ఉంది**
**- అమరుల త్యాగాలు శాశ్వతంగా చరిత్రలో నిలిచిపోతాయి**
**- అమరుల ఆశయ సాధన దిశగా మనమంతా కృషి చేయాలి**
**- శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ టి.భాను ప్రసాద్ రావు**



**పెద్దపల్లి - ప్రభాత సూర్యుడు :** అమరుల త్యాగఫలంతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ టి. భాను ప్రసాద్ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం పెద్దపల్లి నియోజక, జిల్లా కేంద్రంలోని ఎం.పి.డి.ఓ. కార్యాలయం వద్ద గల అమరుల స్థూపం వద్ద నిర్వహించిన అమరుల సంస్మరణ దినోత్సవంలో శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ టి. భాను ప్రసాద్ రావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి లు పాల్గొని అమరవీరుల స్థూపంకు పూల మాలలు వేసి అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అక్కడ నిర్వహించిన కార్యక్రమంలో అమరులను స్మరించుకుంటూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ టి.భాను ప్రసాద్ రావు మాట్లాడుతూ తొలి, మలి, తుదిదశ ఉద్యమాల్లో రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అనేక మంది త్యాగధనులు ఉద్యమంలో పాల్గొన్నారని, వారి త్యాగాల ఫలితంగా రాష్ట్రం ఏర్పడిందని ఆయన అన్నారు.1969 లో ఉవ్వెత్తున వచ్చిన ప్రజా ఉద్యమం తర్వాత తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆకాంక్ష ప్రజలలో ఉన్నప్పటికీ, దానికి ఒక వేదిక కల్పించి 2001 లో ఉద్యమాన్ని సీఎం కేసీఆర్ ప్రా రంభించారని, 14 ఏళ్లపాటు శాంతియుతంగా ఉద్యమ పందాతో ముందుకు తీసుకొని వెళ్లారని ఆయన తెలిపారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో దాదాపు 14 సంవత్సరాల పాటు సుదీర్ఘ పోరాటంలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వామ్యం అయ్యారని, యువకులు, విద్యార్థులు తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ఆత్మ బలిదానం చేసుకున్నారని , ప్రత్యేక రాష్ట్ర సాధనలో అమరవీరుల పాత్ర శాశ్వతంగా నిలిచిపోతుందని చీఫ్ విప్ పేర్కొన్నారు. అమరుల త్యాగంతో ఏర్పడిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి అన్ని రంగాలలో దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దామని, గత 20 రోజులుగా వివిధ శాఖల నుంచి అందుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలను, వచ్చిన మార్పులను వివరిస్తూ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నామని ఆయన తెలిపారు. పెద్దపల్లి జిల్లా పరిధిలో రాష్ట్ర సాధన కోసం 37 మంది ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా ఆత్మ బలిదానం చేసుకున్నారని, వీరి త్యాగాలను గుర్తిస్తూ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి 10 లక్షలు ఆర్థిక సహాయం, అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆ కుటుంబాలకు ఆసరాగా, అండగా సీఎం కేసీఆర్ నిలిచారని ఆయన తెలిపారు. అమరుల ఆశయాల సాధన దిశగా మనమంతా కృషి చేయాలని, వారి ఆశయాలను నిరంతరం గుర్తు చేసుకుంటూ ఆ దిశగా రాష్ట్ర ప్రయాణం జరగాలని, సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమ ఆకాంక్ష లను, అమరవీరుల ఆశయాలను నెరవేరుస్తూ అద్భుత పాలన సాగుతుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని అమరవీరుల కుటుంబాల వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమరవీరుల కుటుంబాలతో కలిసి శాసనమండలి చీఫ్ విప్, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ అల్పాహారం స్వీకరించారు.ఈ కార్యక్రమంలో అమరవీరుల కుటుంబ సభ్యులు, అదనపు కలెక్టర్ వి. లక్ష్మీ నారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, పెద్దపల్లి మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ మమతారెడ్డి, పెద్దపల్లి జెడ్పిటిసి బండారి రామ్మూర్తి, జూలపల్లి జడ్పిటిసి లక్ష్మణ్, శ్రీరామ్ పూర్ జడ్పిటిసి తిరుపతిరెడ్డి, సుల్తానాబాద్ ఎంపీపీ బాలాజీ రావు, మునిసిపల్ కౌన్సిల్ సభ్యులు, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## అమరుల త్యాగాల ఫలితంగా స్వరాష్ట్రం

**కోరుట్ల మున్సిపల్‌లో అమరుల సంస్మరణ వేడుకలు**

**కోరుట్ల - ప్రభాత సూర్యుడు :** అమరుల త్యాగానికి ప్రతిరూపంగా రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి దిశగా ముఖ్యమంత్రి కేసీఆర్ నడిపిస్తున్నారనికోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ అన్నం లావణ్య అనిల్ అన్నారు..తెల ంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం ప్రభుత్వ ఆదేశానుసారం కోరుట్ల పురపాలక సంఘం కార్యాలయంలో అమరుల సంస్మరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ అన్నం లావణ్య,వైస్ చైర్మన్ గడ్డమీది పవన్ , మున్సిపల్ కమిషనర్ ఎండి.ఆయాజ్ ,బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్ ,కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ మెంబర్లు, వివిధ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు తెలంగాణ అమరులకు నివాళులర్పించారు.రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అమరుల సంస్మరణ తీర్మానాన్ని కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు.ఆనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ అన్నం లావణ్య మాట్లాడుతూ రాష్ట్ర సాధనే ధ్యేయంగా తెలంగాణ ఉద్యమంలో బలవంతపు ప్రాణార్పణలు చేసిన అమరులు అనేకంగా ఉన్నారని, ఉద్యమం ఉవ్వెత్తునఎగిరినప్పుడు మాత్రమే కాదు.. నేటికీ అనునిత్యం రాష్ట్ర ప్రజల గుండెల్లో ,పాలకుల మనసుల్లో వారి ఆత్మ త్యాగాలు ప్రజ్వలిస్తూనే ఉన్నదని అన్నారు. అమరుల త్యాగాల ఫలితంగా సాధించుకున్న స్వరాష్ట్రాన్ని బంగారు తెలంగాణ దిశగా నడిపిస్తున్న ఉద్యమ నేత, ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం అనునిత్యం త్యాగధనుల ఆత్మ త్యాగాల గురించి, వారి కుటుంబం సంక్షేమం గురించి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారన్నారు .ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆర్థిక సహాయంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాన్ని కల్పించారని మరోవైపు అమరుల త్యాగానికి ప్రతిరూపంగా రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిదిశగా నడిపిస్తున్నారన్నారు. అమరుల ఆశయ సాధనలో భాగంగా పచ్చని, పరిపుష్టమైన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు సీఎం కేసీఆర్ నిరంతరం తప్పిస్తున్నారన్నారు. అమరుల త్యాగాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అన్నం లావణ్య, కమిషనర్ మొహమ్మద్ అయాజ్ ,వైస్ చైర్మన్ గడ్డమీది పవన్ ,బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం లావణ్య,మున్సిపల్ కౌన్సిలర్లు కో - ఆప్షన్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రజలు,మున్సిపల్ అధికారులు, యువజన నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLA-PURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICA-TION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com